


## (దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

**128**

(21 ' ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**బడ్జెట్ సమావేశాలు** ప్రారంభమైనాయి. ఇలాంటి సందర్భాలలోనే తర్జన భర్జనలు ఎక్కువవుతాయి. పంపిణీలు జరగాలిగా మరి పది విధాలుగా. 'వెన్నవున్న చోటే తన్నుల ప్రకరణ' అన్న సామెత వుందిగా మనకు.

సంసారాల్లో కానివ్వండి, సంస్థల్లో కానివ్వండి, ప్రభుత్వంలో కానివ్వండి బడ్జెట్ అనేదే పెద్ద సమస్యగా మారింది. సామాన్యంగా బడ్జెట్ చాలకపోవడమనేది చాలా సందర్భాలలో జరిగే విషయం. "ప్రభుత్వ బడ్జెట్‌కు లోటు వస్తే పన్నులు వేస్తారు. సంసారంలో బడ్జెట్ చాలకపోతే అప్పులు చేస్తారు" అన్నాడొకాయన.

ప్రభుత్వం కూడా ఒక్కొక్కప్పుడు అప్పులు చేస్తుంది. విదేశాలలో, స్వదేశాలలో కూడా అయినా బడ్జెట్ చాలదు మరి. అదేదో దేశంలో ప్రభుత్వ రాబడి చేసిన అప్పులపైన వడ్డీ తీర్చడానికి సరిపోతుందట. ఇక దాని ప్రగతి ఏమిటో? ప్రజల గతి ఏమిటో.

మరి సంసారాల్లో బడ్జెట్ చాలడమనేది చాలా అరుదుగా జరుగుతూ వుంటుంది. "ఏమమ్మా! అలా బక్క చిక్కిపోయావేం" అంటే "మరేంలేదు పిన్నిగారూ బడ్జెట్ లోటు" అనడంలో ఆశ్చర్యంలేదు.

"ఎలా నడుస్తుంది సంసారం?" అని ప్రశ్నించినప్పుడు అవతల పెద్దమనిషి.

"ఈ తొడిగిన పాత చొక్కా చెప్పడంలా బడ్జెట్ లోటని" అనడం కూడా వింటూ వుంటాం.

"బడ్జెట్‌లో ఏ పద్దన్నా తగ్గించండి, ఏ పద్దన్నా కొట్టివెయ్యండి గాని బట్టల పద్దు మాత్రం తగ్గించకండి మహా ప్రభూ. పకీర్లలా తిరగలేం బిడ్డలు నేనూ" అని ఇల్లాళ్ళు గొడవ చేస్తూ వుంటారు చాలా ఇళ్ళల్లో.

ఆడపిల్ల పెళ్ళి చేయబోయే వాళ్ళు పిల్లాడికేం ఎక్కడో అక్కడ దొరుకుతాడు నలుపో, తెలుపో తర్వాత ఆలోచించవచ్చు. అసలు ముందుగా బడ్జెట్‌తో రోడ్లవెంట పరుగెత్తితే ఏం లాభం? ఒకవేళ ఏదన్నా ఖర్మం చాలక పిల్ల నచ్చిందంటాడనుకోండి మచ్చ మాసిందే

'డబ్బు పుట్టించడం బట్టతలమీద రూళ్ళ కర్ర క్రాఫింగు పెంచడమంత పని అవుతుంది' అని ఆడపిల్ల తండ్రి దిగులుపడటం కూడా సామాన్యంగా చూస్తూ వుంటాం.

ఆడపిల్ల పెళ్ళి చేసిన తర్వాత ఆరేళ్ళదాకా ఆ బడ్జెట్‌లోటే. అద్దైనా ఏ ఒక్క ఆడపిల్లనో కని, గమ్మత్తుగా వూరుకునే వాళ్ళకే. నలుగురు, ముగ్గురు ఆడపిల్లలున్నవాళ్ళయితే ఒకరి తర్వాత ఒకరు వచ్చి రంగస్థలమలంకరించి లోటు బడ్జెట్‌ను

ఇంకా లోటు చేస్తూ వుంటారు. బ్రతుకు చిల్లిబోటు కన్నా కనాకష్టమవుతుంది. ఏ లాటరీలోనో లక్షలు వస్తే తప్ప ఆ లోటు పూడటం దుర్లభం- అని కొందరు గృహస్తులు నైరాశ్యం ప్రకటిస్తూ వుంటారు.

కొందరు ఇల్లాళ్ళు బడ్జెట్ మాటలాలోచించకుండానే "ఏమండీ అలా అంటే కాదు, పిల్లలకు మంచి దుస్తులు కొనాలి. మణుగులు లెక్కన కాకపోయినా చిన్నాల లెక్కనైనా ఏవైనా నగలు చేయించి పెట్టాలి. ఇల్లు చక్కగా అలంకరించుకోవాలి. మనం తిన్నా తినకపోయినా ఎవరికీ తెలియదు. బయటికి పసందుగా కనబడాలి" అని సుదీర్ఘోపన్యాసం ఇస్తూ వుంటారు. పరిస్థితి గ్రహించలేని ప్రమ దౌర్భాగ్యస్థితిలో పడి.

అప్పుడాయన యిలా చెప్పవలసివస్తుంది. తప్పనిసరిగా "నీకు తెలిసినన్ని మర్యాదలు నాకూ తెలుసునే. మరాళకుంతలా! లోటు బడ్జెట్‌లో వున్నామే మిటారీ. కాలం కలసివస్తే నీకన్నా ముందుగా నేనే అవన్నీ సర్దుకుంటానే మదగజయానా" అని.

ఫోర్తుఫారం చదువుకునే ఒక కుర్రవాడు హోటులో కూర్చుని మిత్రునితో చెప్పుతున్నాడు. "ఈ నెలంతా చాలా దరిద్రంలో పడిందిరా. బడ్జెట్ లోటు భర్తీ చెయ్యాలని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. అందువల్ల సినిమా పద్దు తగ్గిపోయింది. ఆరు సినిమాలకే అంచనా వేసుకున్నా కాకా హోటల్ పద్దు తగ్గించడం కష్టం. అలవాటైన కడుపు ఆగ్రహిస్తుంది. లోటు పూడ్చడానికి పన్ను వెయ్యాలి' అన్నాడు.

"ఎలా వేస్తావురా పన్ను? నాక్కూడా కొంచెం చెప్పు" అన్నాడు మిత్రుడు.

"దానిదేం వుందిరా? వివిధ రకాల పన్నులు విధించవచ్చు. కాని అసెంబీల్లో ప్యాసవడమే కొంచెం కష్టం. అక్కడ పద్దు ప్రవేశపెట్టినప్పుడు చక్కగా ఉపన్యాసమివ్వాలి. దానితో పద్దు ఇట్టే ప్యాసవుతుంది" అని ఆ కుర్రవాడు ముసిముసి నవ్వులు నవ్వాడు.

"ఆ ప్రవేశపెట్టడం, ఉపన్యాసిలివ్వడం కొంచెం చెప్పరా నేను కూడా ప్రయత్నిస్తాను" అన్నాడు మిత్రుడు.

"ఒకటి రెండు మాత్రం చెబుతాను. అన్నీ ఎక్కడ కుదురుతుంది? ఒకటి "మొన్న క్లాసులో ఎవడో అల్లరి చేశాడు. ఒక ఆడపిల్లకు ఉత్తరం వ్రాశాడు. చేత్తో వ్రాస్తే పట్టుబడతాడని టైపు చేసి పంపాడు. క్రింద "క్లాస్‌మేట్" అని వ్రాశాడు.

"దాంతో క్లాసందరికీ చుట్టుకుంది. స్వదస్తూరీ అయితే ఎక్సర్ సైజు పుస్తకాలో, ఏవో దగ్గర పెట్టుకుని పట్టుకునేవారు. టైపుపట్టుకోవడం కూడా కష్టమే. కనుక ఇలాంటి సందర్భాలలో మూక ఉమ్మడి జరిమానా వేయడం ఒక్కటే మార్గం. అని క్లాసందరికీ తలో మూడు రూపాయలు జరిమానావేసిన మరునాడు తీసుకురాని వాళ్ళను ఆరురోజులు గైరు హాజరూ, పరీక్ష మార్కుల్లో పది తగ్గింపూ" అన్నాడని బిక్క మొఖం పెట్టి చెప్పడం.

"అమ్మ కాసేపు ఆశ్చర్యపోవడం, కాసేపు చింతించడం కొంచెం సేపు హెడ్ మాస్టర్ని శాపనార్థాలు పెట్టడం తర్వాత మూడు రూపాయలు చేతిలో వేసి పంపించడం జరుగుతుంది. మూడు రూపాయల మేరకు మనలోటు తీరుతుంది" అని చెప్పాడు. తోటివాడు ఉప్పొంగిపోయి ఇంకొక్కటి చెప్పరా" అన్నాడు.

"మరేం లేదు పలానా టెస్టుబుక్కు ఎవరో ఎత్తుకుపోయాడు. మంచినీళ్ళు త్రాగి వచ్చేసరికి మాయం చేశాడు. ఆ పుస్తకం లేకపోతే మాస్టారు క్లాసులోకి రానీడు. నాన్నకు తెలిస్తే గొడవ చేస్తారు. అందాకా ఎందుకూ ఒక వారం రోజులు మధ్యాహ్నం అన్నం మానేస్తాను. ఆ డబ్బుతో పుస్తకం కొంటాను. రేపటినుంచి పంపకే అమ్మా" అంటూ కన్నీరు కార్చడం.

దాంతో తల్లిప్రాణం దడదడాకొట్టుకుని "అసలే అర్భకుడిని. అందులో అన్నం కూడా మానుకుంటావట్రా బాబూ? అందులో ఇప్పుడు అప్పుడే వేసం కాలం ఆరంభమైంది. మీ నాన్న కిరసనాయిల బాకీ ఇమ్మని అయిదు రూపాయలిచ్చారు. ఆ అమ్మాయిని బ్రతిమాలుకుంటా పది రోజులు ఆగమని. పుస్తకం ఖరీదెంత?" అనడం. ఆవిడ అవి యిచ్చి రెండన్నా మిగిలినందుకు సంతోషించడం అంతవరకు మన బడ్జెట్ లోటు పూడటం" అని చెప్పాడు.

బడ్జెట్ మీద ఎన్నో విచిత్రాలున్నాయి. అది అనేక రూపాల్లో అవతరిస్తూ వుంటుంది. లక్ష్మిని బంధిస్తూ ఉంటుంది.

Post your comments